ఏ రిక్షావాడూ మూడు రూపాయలకు తక్కువ వప్పుకోని
బేరాన్ని కేవలం రూపాయి ముప్పావలాకే వప్పేసు
కొన్న రిక్షావాడు అమాయకుడా? అమాయ
కంగా కన్పించే వాడా?

# బ్రతక నేర్చినవాడు

హోటలు సాపాటు తినగలిగినంతా తిని, కిళ్ళీ వొకటి బిగించి, విల్స్ఫ్లేక్ కింగ్స్ రెండు కొని వొకటి జేబులో భద్రపరిచి వొకటి వెలిగించాడు మూర్తి-సిగిరెట్టు వొకటి కొంటే పద్దెనిమిది పైసలు, రెండు కొంటే ముప్పై అయిదు పైసలు-వొక పైస ఆదా!

రాత్రి తొమ్మిది దాటుతోంది. దుర్గానగర్ కాలనీ వూరికి రెండు మైళ్ళ దూరంలో వుంది. ఆరు కేజీల బరువున్న సూటుకేసుతో అంత దూరం నడవటం-ప్రయాసే!

"—ఏయ్ రిక్షా...."

రివ్వుమని వొచ్చి వాలింది రిక్షా.

"దుర్గానగర్ కాలనీ.. .వొస్తావా?—"

"దుర్గానగరా సార్..."

"అవును....ఎంత కావాలి?...."

"మూడ్రూపాయల్సార్!...."

"మూడు రూపాయలా!...." వీడి రిక్షాలో ఎక్కడం పడదు-అనుకున్నాడు మూర్తి.

"ఏమిస్తారు సార్?... "

"రూపాయిన్నరిస్తా...."

"హె—" అంటూ నవ్వేడు రిక్షావాడు. మరోమాట లేకుండా రిక్షా తిప్పుకుని రివ్వున మాయమైపోయాడు.

తలపొగురు— వెధవలకి....అని తిట్టుకున్నాడు మూర్తి. సరే వీడు కాకపోతే మరోడు-వీడి బాబులాంటివాడు-అనుకున్నాడు.

నిజంగా మొదటి రిక్షావాడి 'బాబు' లాంటి వాడే వొచ్చాడు.

"రండి బాబూ...." అన్నాడు, ఖంగుమని దగ్గుతూ, ఎక్కడికన్నైనా అడక్కుండా.

ఎక్కడికో చెప్పగానే మాత్రం-"దుర్గానగరా బాబూ!" అన్నాడు, అప్పుడే బోల్డు ఆయాస పడిపోతూ.

"అవును దుర్గానగరే...."

"శానాదూరం బాబూ—వూరుదాటి అంతా మిట్ట. మూడ్రూపాయలిప్పించండి బాబూ."

మళ్ళీ వీడూ 'మూడ్రూపాయలు' దుర్గానగర్‌కి ఇది స్టాండర్డ్ రేటులా వుంది. అయినా 'ట్రయ్' చేస్తే?.

"రూపాయిన్నరిస్తానయా...పైసా కూడా ఎక్కువీను .... వొస్తేరా .... లేకపోతేపో .."

పెట్టె చేతిలోకి తీసుకుని దబాయింపుగా రెండడుగులు వేశాడు, అలాగైనా ముసిలాడు మెట్టుదిగతాడని.

మాట లేకుండా ఆయాసపు దగ్గు దగ్గుతూ గొణుక్కుంటూ కొంతదూరం రిక్షా తోసుకుంటూ వెళ్ళి ఆ తరువాత రిక్షా ఎక్కి దూరమైపోయాడు ముసిలాడు.

'వెధవలు-వెధవలు' అని తిట్టుకున్నాడు మూర్తి. అరిచి గీపెట్టినా వీళ్ళతో రాజీకి మాత్రం రాకూడదు—అనుకున్నాడు.

ముసిలాడు వెళ్ళిన వేపునుంచి ఇంకో రిక్షా వొచ్చింది. వీడు మెల్లకంటివాడు. తాజుగా రాజులా పోజుపెట్టి వొస్తున్నాడు. "రిక్షా—"

చప్పున దగ్గరకొచ్చి రిక్షా ఆపి, బండి దిగి, మూర్తి చేతిలోంచి సూటుకేసు లాక్కోబోయాడు మెల్లకంటివాడు.

"—దుర్గానగర్ కాలనీ.." బెదిరింపుగా

---

కెఎస్వీ

---

అన్నాడు మూర్తి.

బెదర్లేదు వాడు, సూటుకేసు 'బండి'లో పెట్టేసుకున్నాడు. "ఎక్కండి బాబూ!...."

"ఎంత?...."

తేటగా నవ్వేడు వాడు,"ఎంతో వొకంత. .. తమకి తోచినంత ఇద్దురు గాన్లెండి....ఎక్కండి బాబూ...." మళ్ళీ నవ్వేడు, చిల్లగింపుగా.

సందేహం లేదు. వీడు టోపీ దాసు. పెద్ద పేచీకోరు. తీరా అక్కడ దిగేక నానా గొడవ చేసి బూతు పంచాంగం విప్పేరకం.

"ఎంతో నువ్వు చెప్పవయా...."

"నేను చెప్పేదేముంది బాబూ! తమకి తెలీదా? నా కష్టం తమరుంచుకుంటారా.... ఎక్కండి బాబూ!...."

"కష్టపడేవాడివి ..నువ్వు ఇంత కావాలీ అని ముందే అడగాలోయ్. ....ఎంత చెప్పూ...."

రేటు చెప్పటం తప్పనిసరయినందుకు కించిత్తు చింతిస్తూ, తేట నవ్వును తైరు నవ్వుగా మార్చాడు మెల్లకంటి రిక్షా చోదకుడు. తాజుగా రాజులా వొస్తున్నప్పటి పోజుకూ ఇప్పటి ధోరణికీ పోలికేలేదు.

"మూడున్నరిప్పించండి బాబూ!...."

"వార్నీ వోగాయిత్వంగూల!—"అని స్వగతంలో ముక్కున వేలేసుకున్నాడు మూర్తి.

వీడితో ఇంకా బేరమాట్టంకూడానా? నయం—ముందే పట్టుబట్టి అడిగేశాడు. తీరా అక్కడ దిగాక—నిజంగానే అల్లరి చేసేవాడు.

"రూపాయిన్నరిస్తా!—"అన్నాడు మూర్తి. మొండిగా అనేశాడు.

చురుక్కుమని చూశాడు (!) మెల్లకంటి వాడు.

"హుం—" అని స్పష్టంగా హుంకరించాడు. వొక్క వుదుటన—రిక్షాలో రెణ్ణిమిషాల క్రితం అతి జాగ్రత్తగా ఉంచిన సూటుకేసుని—ధబ్బున నేలమీద పడేశాడు.

"రూపాయిన్న రిస్తాట్ట. . దుర్గానగర్‌కి.... ఏం—మేం రిక్షావోళ్ళమా — అడుక్కునే వోళ్ళమా....ధర్మానికిచ్చేట్టుగా వుంది....దుర్గానగర్‌కి—రూపాయిన్నర! ..."

విసురుగా రిక్షా ఎక్కి 'టప్ టప్' మని చైను చప్పుడు చేసేలా తొక్కుంటూ సభాభవనం నుంచి కోపంగా నిష్క్రమించే రాజులా వెళ్ళిపోయాడు మెల్లకంటివాడు.

పట్టరాని కోపమొచ్చింది మూర్తికి "స్కౌండ్రల్! స్కౌండ్రల్!—" అని తిట్టుకున్నాడు. పళ్ళు పటపట లాడించాడు.

టైము చూసుకున్నాడు—తొమ్మిదింబావు!....

ఈ రిక్షా బేరాలతోనే రాత్రి గడిచిపోతుందేమిటి?

తా నొకటి తలచిన రిక్షావా డొకటి తలచునా?

"రిక్షా సార్!...."

వీడూ దగుల్బాజీయే అయివుంటాడు. అయినా—కదిపి చూద్దాం. అయితే—దుర్గానగర్ వెళ్ళటానికి తొందరపడుతున్నట్టు మాత్రం వీడికి అనిపించకూడదు.

"ఏం టోయ్?...."

"రిక్షా కావాలా సార్?"

"ఆఁ...." ఏదో చిరాకుగా, గంభీరంగా వాచీ చూసుకున్నాడు. పెద్ద తొందరేం లేనట్టు చప్పరించాడు.

"దుర్గానగర్ కాలనీదాకా వెళ్ళాలోయ్...."

"దుర్గానగరా సార్.. ."

"అవునోయ్...."

"రెండున్నర్రూపాయిప్పించండి సార్. "

"ప్చ్!...."

"ఏం సార్?...."

"మరీ యెక్కువడుగుతున్నావోయ్...."

"ఏమీ యెక్కువడగలేస్సార్....నే నందరు రిక్షావాళ్ళలాగా అడిగేవాణ్ణి కాన్సార్. . .అయినా —మీ దగ్గిర నేను ఎక్కువడిగేదేముంది సార్!?...."

"ఎక్కువేనోయ్ ..."

"పోనీ—ఎంతిస్తారో చెప్పండి సార్. .."

"నువ్వు రెండుంబావలా చెప్తే—ఇంకా నేను చెప్పేదేముంది—"

"పోనీ—ఎక్కండి బాబూ—ఆ పావలా తో సెయ్యండి—రెండ్రూపాయలిప్పించండి—ఎక్కండి—"

వీడెవడో మంచివాడులాగా వున్నాడు. ఈ రిక్షా రొక్కడు బిజినెస్‌కి కొత్తవాడిలా వున్నాడు. గుట్టుచప్పుడు కాకుండా ఎక్కేసి రెండ్రూపాయ లిచ్చేయడం ఉత్తమం. ఈలోగా ఇందాకా తనతో బేరాలాడిన రిక్షావాళ్ళలో ఎవరైనా ఇటుగా వచ్చి—చాటుగా వీడికి సైగ చేసేసినా చేసెయ్యగలరు. బేరం బెడిసి కొడుతుంది! అయినా చూదాం ఆఖరి ప్రయత్నంగా!

"సరే — ఒకటిమ్ముప్పావలా యిస్తానయా. "

"సార్!. " దెబ్బతిన్న పక్షిలా చూశాడు వాడు. ముఖం ముడుచుకున్నాడు. తటపటాయిస్తూ అలాగే నిలుచున్నాడు.

ఈ బేరం కూడా కుదిరినట్టే కుదిరి ఎక్కడ చెయి జారిపోతుందోనని గుండె పీకింది మూర్తికి.

వీడు వెళ్ళిపోతే.—మరొడెవడు దొరుకుతాడు రెండుకి వొచ్చేవాడు? పావలా దగ్గర ప్రలోభపడితే-రూపాయి-లాస్! అంతలో—

"సరే—ఎక్కండి సార్! . "

కఠోరమైన విధినిర్ణయాన్ని వీపుమీద భరించే హీరోలా కదిలేడు వాడు. సూట్‌కేస్ రిక్షాలో పెట్టుకున్నాడు.

రిక్షాసీటులో కూలబడి 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నాడు మూర్తి.

షాపుల దీపకాంతుల్ని మెల్లి మెల్లిగా వెనక్కి తరలిస్తూ - రిక్షా ముందుకు కదిలింది.

జనసందోహాన్ని గజిబిజినీ చీల్చుకుంటూ మౌనంగా 'పెడల్' చేస్తున్నాడు రిక్షావాడు.

రాస్తా ఊరుదాటివచ్చాక కూనిరాగం తియ్యడం మొదలుపెట్టేడు. ఆ తరువాత ప్రసిద్ధ సినీగీతాలను రాగయుక్తంగానే గానం చేశాడు. బొత్తిగా నిర్జనమైన రోడ్డుమీదికి వచ్చాక, పాట ఆపి—మూర్తితో మళ్ళీ మాట కలిపాడు.

"ఇంతకీ—మీరు దుర్గానగర్ కాలనీలో ఎక్కడికి కెళ్ళాల్సార్?"

పేరుకి కాలనీ ఐనా దుర్గానగర్‌లో ఆరేడు కంటే ఇళ్ళులేవు. ఆ ఉన్నవీ చెదురు మదురుగా విసిరేసినట్టు అక్కడొక్కటీ ఇక్కడొక్కటీ వున్నాయి. కాలనీ మొదట్లోనూ కాలనీ అవతలా గుడిసెలు మాత్రం చాలానేవున్నాయి.

"కాలనీ మొదట్లోనే మర్రిచెట్టొకటుంది తెలుసా?"

"మర్రిచెట్టా సార్?—"

"పెద్ద మర్రిచెట్టోయ్—వూడలూ అవీ బాగా దిగి—"

"అవున్సార్! ఆఁ!—మర్రిచెట్టు—"

"ఆ మర్రిచెట్టుకి కొంచెం పైనే—పచ్చ మేడొకటుంది — డాక్టరుగారిది. వాళ్ళింటికి వెళ్ళేది."

"అబ్బ-ఊరికి ఇంత దూరంగా-చాలా కష్టం సార్ వుండటం . "

"ఎలాగో వుంటున్నాడు గదా వూళ్ళో యిళ్ళంటే అద్దెలు సామాన్యంగా వుంటయా. నూటయాభయ్యట—ఆ పచ్చమేడకి అద్దె. చవక కదూ "

"అవున్సార్! "

"ఎంతా రెండేళ్ళయింది మా వాడు ప్రాక్టీసు పెట్టి .. ఇదివరకోసారి వొచ్చినప్పుడు యేఁవీఁ బాగా జరగటం లేదన్నాడు. మళ్ళీ పికప్ అయిందని వుత్తరం రాశాడు. ..వూళ్ళో యిల్లు గనక వుంటే రాత్రి బాగా పొద్దుపోయే దాకా క్లినిక్ తెరిచి వుండొచ్చు ...యిల్లు దూరంగదా .. ఎనిమిదికే మూసేస్తున్నానని రాశాడు "

"ఇంతకీ మన్దేవూరు సార్?.. "

"ఏవూరైతేనేంలే . ఉద్యోగం అనకాపల్లిలో. ఆఫీసు పనిమీదే సికిందరాబాదు దాకా వెళ్ళాల్సొచ్చింది. తిరుగుబస్సులో పదేసరికి మా వాడు గుర్తొచ్చాడు. సరే-ఎటూ దారేగదా—కాస్త ఇక్కడ దిగి వీణ్ణి పలకరించినట్టూ వుంటుంది—వోపూట రెస్టు తీసుకున్నట్టూ వుంటుంది-ఎటూ రేపు ఆదివారమే గదా తీరా చూస్తే దార్లో బస్సు చెడి గంటన్నర లేటయింది—లేకుంటే మా వాణ్ణి క్లినిక్‌లోనే

పట్టుకునే వాణ్ణి-ఇద్దరం కులాసాగా వొచ్చుండే వాళ్ళం—అనవసరంగా హోటల్ భోజనానికి రెండూముప్పై తగెయ్యాల్సొచ్చింది."

"అవున్సార్!...హోటల్ భోజనమంటే అంతే—"

దుర్గానగర్ కాలనీ రోడ్డు-ఉయ్యాల లూగిస్తోంది. గతుకుల కంకర రోడ్డు.

"ఎప్పుడయా యీ వూపు బాగుపడేది—యీ కాలనీ మున్సిపాల్టీలోకి జేరలేదా యేం—ఇంకా—"

మాటలు మానేశాడు రిక్షావాడు-వొగరుస్తూ రిక్షా తొక్కుతున్నాడు.

"పాపం-రిక్షా తొక్కటం కష్టమే—" అనుకున్నాడు మూర్తి. అయినా—ఒకటిమ్ముప్పావలా యిస్తున్నాడు కదా? అది మాత్రం వూరికే వొస్తుందా?

బాగా చీకటిగా వుంది. రిక్షాకి వున్న గుడ్డి దీపపు వెలుగు రోడ్డు గతుకుల్ని ఎత్తి చూపలేకపోతోంది. గతుకులో చక్రం పడినప్పుడల్లా ప్రాణం గజం ఎత్తున లేచి పడుతున్నట్టుంది మూర్తికి. 'మెల్లిగా పోనీవయా' అందామనుకున్నాడు. కాని, అనలేకపోయాడు.

అల్లంత దూరాన ఎత్తుగా చీకటి దయ్యంలా కనిపించింది మర్రిచెట్టు. మరో అయిదు నిమిషాలకి పచ్చబంగళా ముందు రిక్షా దిగి 'అమ్మయ్య' అనుకున్నాడు మూర్తి. జేబులోంచి రూపాయ నోటూ చిల్లరా తీసి—వొకటికి రెండుసార్లు చిల్లర లెక్కపెట్టి రిక్షావాడికి సరిగ్గా ఒకటిమ్ముప్పావలా ముట్టజెప్పాడు. "సరిపోయిందా—చూసుకో—" అన్నాడు.

"సరిపోయుంటుందిలేండి సార్—" అంటూ డబ్బు జేబులో వేసుకుని రిక్షా వెనక్కి మళ్ళించుకున్నాడు వాడు.

ఏదో తృప్తిలాంటిది కలిగింది మూర్తికి. మూడు రూపాయలకు తగ్గదనిపించిన బేరాన్ని ఒకటిమ్ముప్పావుకే సాధించినందుకు కించిత్తు గర్వమనిపించింది.

కాని, ఆ తృప్తినీ గర్వాన్నీ నిలుపుకునే వ్యవధిలేకపోయింది మూర్తికి.

రిక్షాదిగి,సూట్‌కేసుతో పచ్చమేడకాంపౌండ్ వేపు నిదానించి చూసేసరికే ఏదో అనుమానమనిపించింది. ఇంటివేపు పరికించి చూశాడు-నిజమే-లోపల లైట్లు లేవు. అప్పుడే లైట్లు ఆర్పేసుంటారా? కళ్ళు పొడుచుకుని చూశాడు తలుపులు-అవును-తాళం వేసినట్టు-సందేహం లేదు-తాళంవేసి-వున్నాయి!

"హతవిధీ!" అనుకున్నాడు మూర్తి. బహుశా సినిమాకుగాని వెళ్ళుంటారనుకున్నాడు ఆ ఆశకు బలం కల్పించుకుందామనుకుంటూ వుండగా—

"ఎవరు బాబూ?"—

ముసిలి గొంతొకటి వినిపించింది.

కాంపౌండు వారగావున్న గుడిసెముందు మంచంలోవున్న ముసిలాడు మూర్తిని చూసి లేచి కూచున్నాడు.

"డాక్టరుగారు-లేరా?"—

"మీరెవరు బాబూ?"—

"నేను—ఆయన ఫ్రెండ్‌ని స్నేహితుణ్ణిలే"

"డాక్టరుబాబు—లేరుబాబూ - అమ్మగారూ ఆయనా — భోజనాలు చేస్తుండగా ఏదో తంతొచ్చిందట—అరిజెంటుగా వూరుకు బోవాలని యెల్‌పోయినారు...."

"ఎప్పుడొస్తారు? ఏమన్నా చెప్పారా?"—

"చెప్పలేదు బాబూ—అరిజెంటు-వూరుకు బోతుండాం అన్నారు. అంతే బాబూ—వారే ముసిలోడా-యిల్లు కొంచెం జూస్తావుండు—అని చెప్పిపోయినారు—అంతేబాబూ—"

ఉన్నచోటే కూలబడిపోవాలనిపించింది మూర్తికి. చేతిలో సూట్‌కేస్ బరువుకి అలా కూలబడి పోయేవాడే!

అంతలో—గుర్తొచ్చింది.

చప్పున వాచీ చూసుకున్నాడు.

రొమ్మిదీ నలభై.

సరిగ్గా పదిగంటలకి మెయిలుంది. ఎక్కేస్తే తెల్లారేసరికి వూళ్ళో దిగెయొచ్చు. లేకుంటే ఊళ్ళో ఎక్కడన్నా లాడ్జిలో ఈ రాత్రి గడపాలి. పది రూపాయాలు-గొంగుడు. మెయిలు — మెయిలే వుంది. వేరే బస్సూ గట్రా ఏదీ లేదు. సరిగ్గా ఇరవై నిమిషాలు—

చూపుసారించాడు మూర్తి. రిక్షావాడు ఇంతలో ఎంతదూరం వెళ్ళుంటాడు?—కనిపించడే!.... మళ్ళీ రిక్షా—మరో ఒకటిమ్ముప్పావు! అయినా తప్పదు! నడిచివెళ్తే—మెయిలందదు! ఇంతకీ ఈ రిక్షా కనిపించదు! అప్పుడే మెయిన్ రోడ్డెక్కేశాడా?

"ఏం సార్?"

అంతదూరం నుంచి కేక.

మర్రిచెట్టుకి అవతలగా సిగిరెట్ల బడ్డీవున్న పాక దగ్గిర్నుంచి కదిలివొస్తోంది రిక్షా. రిక్షా వాడి వదనం నుంచి పొగమేఘం-రేగుతోంది.

హమ్మయ్య—బ్రతికించాడు. తొందరపడి వెళ్ళిపోలేదు వీడు!

"రావోయ్ రిక్షా!—"

"ఏంసార్?"—

"మా వాడు ఇంట్లో లేడోయ్! తాళం వేసుంది మనం మళ్ళీ టౌన్‌కెళ్ళాలి!"

"ఎక్కండ్సార్!"—

"రైల్వేస్టేషన్ కెళ్ళాలోయ్! మెయిలందుకోవాలి—ఇంక సరిగ్గా—పద్దెనిమిది నిమిషాలు టైముంది—"

"ఎక్కండ్సార్ మరి—"

ఎక్కి కూలబడ్డాడు మూర్తి. "తొందరగా పోనీ—" అన్నాడేగాని, నిమిషానికూడా రిక్షా కదలకపోవడం గమనించలేదు మూర్తి.

"ఎంతిస్తారు సార్?"—

"అదేమిటోయ్ — ఒకటిమ్ముప్పావూ యిస్తాలే"—

"కిట్టదుసార్.. అది వొచ్చేటప్పుడు-ఇది పొయ్యేటప్పుడు"—

ఏఁవిటోయ్ .... ఏఁవిట్నువ్వనేది? నాకేం అర్థం గావడంలా—వొచ్చేటప్పుడు అప్పు! ఇప్పుడంతా దొనేగదా! — నిజానికి యింకా తక్కువివ్వాలి — పోనీ — తెలిసిన రిక్షాయే గదాని—వొకటిమ్ముప్పావూ యిస్తానన్నాను."

"అదేం కుదర్దుసార్! ఇప్పుడు నాలుగు

"వ్హాట్!"—

"అవున్సార్!... నాలుగు రూపాయలు! ఇస్తారా చెప్పండి—లేకుంటే దిగిపొండి"—

వీడా బంకు దగ్గిరికెళ్ళి ఇంతలో తాగిగాని వొచ్చాడా అనుకున్నాడు మూర్తి.

కాని—అలా కూడా అనుకోటానికి వీల్లేదు.

వీడెవడో తెలివైనవాడిలా వున్నాడు.

ఈ ప్రాంతాల్లో వేరే రిక్షా దొరకదు. తను నడిచి సూట్‌కేస్ మోసుకుంటూ వెళ్ళలేడు. వెళ్ళినా మెయిలు అందుకోలేడు. మెయిల్ అందుకోకపోతే—

"బొరా!" అనుకున్నాడు మూర్తి.

"ఏదొకటీ తొందరగా చెప్పండ్సార్! నాలుగు రూపాయ లిస్తారా?"

ఒళ్ళు మండుకొచ్చింది. ఏం బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు వీడు! ఎంత తలపొగరు?

"అన్యాయమోయ్! చాలా అన్యాయం! ఇలా అడగటం నీకే మంచిది కాదు—"

"ఆ మాటలన్నీ ఎందుకుసార్! చెప్పండి—నాలుగిస్తారా?"

"సరే—మూడిస్తా—"

"దిగెయ్యండి సార్!—"

"ఏంటయ్యా—అవతల మెయిలు—"

"నాలుగిస్తారా?—"

కళ్ళ నీళ్ళొచ్చేంత పనయింది. అతి ప్రయత్నంమీద ఉక్రోషాన్ని బిగబట్టుకున్నాడు మూర్తి. ఏం చెయ్యగలడు తను యీ రిక్షావాణ్ణి?—

వాచీ చూసుకున్నాడు. ఇంక సరీగ్గా—పావుగంట—

"సరేనోయ్—పద—" అన్నాడు ఓటమిని ఒప్పుకొంటున్న స్వరంతో.

"అయితే — ఏదీ — ఇచ్చెయ్యండ్సార్!—"

"ఏఁవిటి?—"

"నాలుగు రూపాయలు—"

మండుతూ కళ్ళు, కోపంతో వూగిపోయాడు మూర్తి.

"ఏం—ఆ మాత్రం నమ్మకంలేదా?—"

"ఏమో—ఎవరు చూశారు? అవతల మెయిలు టైము అయిపోతోంది—రానివ్వండి మరి—" చెయ్యి చాపాడు.

పళ్ళు బిగబట్టి—జేబులోంచి కాగితాలు తీసి లెక్కబెట్టి, విసురుగా వాడి చేతిలో కుక్కాడు. "ఊఁ పద—"

పకపకా నవ్వేడు రిక్షావాడు—"ఇహ చూడండి మన స్పీడు—"

స్పీడు—నిజంగానే చూపించాడు రిక్షావాడు.

ఊపిరి బిగబట్టుకుని కూచున్నాడు మూర్తి. శరవేగమో, వాయువేగమో, మనోవేగమో—

ఏమిటో చీకటిగా వున్నది వెలుతురైంది. టౌనులో లైట్లలా అనిపించింది. ఏవో శబ్దాలూ గందరగోళమూ వినిపించింది—కార్లా—లారీలా—మనుషులా—

"దిగండ్సార్—"

ఆశ్చర్యం! తను చెక్కుచెదరకుండానే వున్నాడు. రిక్షా దిగుతున్నాడు—స్టేషన్‌లో.

"మరేం—యిదవకండి సార్....మనం ముందే వొచ్చేసినాం—మెయిలు కదల్డానికింకా దండిగా టైముంది—"

వాచీ చూసుకున్నాడు మూర్తి. నిజమే—చాలా తొందరగానే వొచ్చేశారు. అయినా—వెళ్ళాలి—స్టేషనులోకి—కాని—

రిక్షావాడివేపు తీక్షణంగా చూశాడు మూర్తి. అడగకూడదనుకుంటూనే అడిగేశాడు—

"ఏమోయ్—వెళ్ళేప్పుడు—వొకటి మ్ముప్పావుకే వొచ్చినవాడివి—"

తేటగా—శాంతంగా నవ్వేడు రిక్షావాడు—"నిజం చెప్పేదా సార్...."

"ఏవిఁటి?—"

"మా ఇల్లు కూడా దుర్గా కాలనీలోనే...అంటు—మా గుడిసె—ఆ మర్రిచెట్టు దగ్గిరేనండి...."

"ఏఁవిటీ?"

"అందుకే—వెళ్ళేప్పుడు—తక్కువ రేటు కొచ్చానన్నమాట...."

"మరి—వొచ్చేప్పుడు—"

"మరంతే గదా—మళ్ళీ నేను ఖాళీగా ఇంటి కెళ్ళాలి—ఆ ఛార్జీ కూడా కలిపి—టోటల్‌గా ఐదుమ్ముప్పావు—మీ దగ్గిర కిట్టించుకున్నానన్నమాట—"

"ఔరా!—"

బొంయ్యిమని కూస్తోంది మెయిలు. దడదడమని ప్లాట్‌ఫామ్మీదికి వొస్తోంది.

"అన్యాయమోయ్! చాలా అన్యాయం.... నన్ను ఏడిపించి తిన్నావ్..."

సూట్‌కేసు పుచ్చుకుని రెండడుగులు వేశాడు మూర్తి.

"ఇంకోమాట సార్!—"

"ఏఁవిటి?—"

"మీకు చెప్పొచ్చో చెప్పగూడదో—"

"ఏంటి—చెప్పు—"

"ఏఁవీ—అనుకోగూడదు మీరు—"

"చెప్పవోయ్—ఇంకా సస్పెన్సేవిఁటీ—"

"మీ డాక్టరుగార్ని టౌనులోకి తీసుకొచ్చింది నేనే సార్!—అమ్మగార్ని ఆయన్నీ బస్సెక్కించి వొస్తుంటే—మీరు కనిపించారన్నమాట...."

"ఔరా! ఔరా!—"

అని నోరు తెరిచేశాడు మూర్తి.

"ఏమనుకోకండి సార్!—మీ మెయిలొచ్చేస్తావుంది—పరిగెత్తండి మీరు.... మరేమీ ఇది కావొద్దు—ఎవరయినా బ్రతకనేర్వకపోతే కుదరదుగదా సార్.."

రిక్షావాడి మాటలు యింకేమీ వినిపించలేదు మూర్తికి. మెయిలు కూతతో చెవులు చిల్లులు పడతాయనిపించింది— □